నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - కడప

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం సభాభవన్‌లో నిర్వహించనున్నట్లు డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించ చవచ్చునని తెలిపారు. డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు నిర్వహిస్తామని ప్రజలు 08562-244437 నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చు అని తెలిపారు.

'తల్లికి వందనం'లో కోతలు వద్దు : డివైఎఫ్ఐ

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని

ప్రజాశక్తి - బద్వేల్

డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎటువంటి నిబంధనలు లేకుండా తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం కూటమి ఎన్నికల్లో వాగ్దానం చేసినట్లుగా 'తల్లికి వందనం' నగదును అర్హులైన విద్యార్థులందరికీ నిబంధనలు సడలించి తల్లుల ఖాతాల్లో జమ చేయాలని, అర్హులైన నిబంధనలతో దాదాపు 9 లక్షల కుటుంబాలకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. ఆదాయ పరిమితిని సడలించి గ్రామాల్లో 2.5 లక్షలు, పట్టణాల్లో 3 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలన్నిటికీ తల్లికి వందనం వర్తింపజేయాలని, ఆదాయంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారందరికీ పథకాన్ని వర్తింపజేయాలని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం ఒకటో తరగతి, ఇంటర్‌లో అడ్మిషన్లు అయిన వెంటనే వారికి కూడా నగదు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లు, వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పిల్లలకు కూడా పథకాన్ని వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం విధించిన షరతులను నాడు విమర్శించిన కూటమి నేతలు నేడు అంతకుమించిన షరతులు పెట్టి లబ్ధిదారులతోపాటు నగదును కూడా తగ్గించడం సరికాదని చెప్పారు. రూ.15 వేలు నేరుగా తల్లులకు ఇస్తామని చెప్పి, ఇప్పుడు రూ.2,000 మినహాయించడాని పేర్కొన్నారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా ఇస్తామని చెప్పి, ఫీజు రీఎంబర్స్‌మెంట్ పొందుతున్న కుటుంబంలోని విద్యార్థులకు ఈ పథకం అమలు కాకుండా మినహాయించడం హామీ ఉల్లంఘనేనని చెప్పారు. ఇంత వరకు ఫీజురీయింబర్స్‌మెంట్ ఎవరికీ ఇవ్వకుండానే ఆ పేరుతో తల్లికి వందనంపై కోత విధించడం అన్యాయమని, విద్యాహక్కు చట్టం కింద ప్రయివేట్ స్కూల్లో చదువుతున్న వారి తల్లులకు కూడా నేరుగా స్కూల్ మేనేజ్‌మెంట్ ఖాతాలకు చెల్లించడం ప్రభుత్వ విద్యను దెబ్బతీయడమేనని, గ్రామ వార్డు సచివాలయాలలో వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించి అర్హులందరికీ ఈ పథకం అమలు చేయాలని డివైఎఫ్ఐగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి షేక్ ఆదిల్‌బాషా, రూరల్ అధ్యక్షులు ముడమాల ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.

డయల్ 112 సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా ప్రజలు పోలీస్ హెల్ప్ లైన్ నంబర్ 112ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదాలు, న్యూసెన్స్, కుటుంబ తగాదాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, గొడవలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికల వివరాలను డయల్ 112 కు కాల్ చేసిన వెంటనే స్పందించి పట్టణ ప్రాంతాల్లో అయితే బ్లూ కోల్ట్స్, రక్షక్, పోలీస్ వారు కేవలం 3 నుంచి 4 నిమిషాల వ్యవధిలో, గ్రామీణ ప్రాంతాల్లో అయితే కేవలం 6 నుండి 10 నిమిషాలలోపు ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను తెలుసుకుని, తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. 112 హెల్ప్ లైన్ నంబర్ 24X7 కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానమై అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో విధుల్లో ఉన్న బ్లూ కోల్ట్స్, రక్షక్, పోలీస్ సిబ్బందికి క్షణాల్లో సమాచారం వెళుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రజలు గతంలో పోలీస్ హెల్ప్ లైన్ నంబర్‌గా ఉన్న డయల్ 100 నంబర్‌కు బదులు హెల్ప్ లైన్ నంబర్ 112 నంబర్‌గా ప్రభుత్వం మార్చిందని చెప్పారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి 112 హెల్ప్ లైన్ నంబర్ సద్వినియోగం చేసుకుని శాంతిభద్రతల పరిరక్షణలో తమ వంతు సామాజిక బాధ్యతను నిర్వర్తించి పోలీస్ శాఖకు సహకరించాలని తెలిపారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ద్వారా పోలీసు సేవలను ఉపయోగించుకుని ఇళ్లలోని విలువైన వస్తువులకు రక్షణ కల్పించుకోవాలని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ ప్రజలకు సూచించారు. ఇంటికి తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు 8186881100కు సమాచారమిస్తే పోలీసు వారు వచ్చి మీ ఇంటిలో ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలను అమర్చుతారని తెలిపారు. ప్రజలందరూ సహకరిస్తే దొంగతనాలను అరికట్టడమే కాక, దొంగల ఆటలను సులువుగా కట్టించవచ్చని పేర్కొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి దిక్సూచి ప్రతిభ పురస్కారాలు

కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే, సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి- కడప అర్బన్

ప్రతిభా పురస్కారాలు విద్యార్థుల ఉన్నతికి దిక్సూచిలా ఉపయోగపడతాయని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించే క్రమంలో వారిలో నూతనోత్సాహాన్ని పెంపొందిస్తాయని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం పాత రిమ్స్‌లోని బిసి భవన్‌లో తొగటవీర క్షత్రియ కులానికి చెందిన పదవ తరగతి విద్యార్థుల ప్రతిభా పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే విద్యార్థులకు నగదు పురస్కారాలు, మెడల్స్, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులంలో ఉన్న వెనుకబాటుతనాన్ని, పేదరికాన్ని, అసమానతలను తొలగించే విధంగా ప్రతిభా పురస్కారాలను అందజేసి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకున్న తర్వాత కులానికి, సమాజానికి ఉపయోగపడినప్పుడే జీవితానికి నిజమైన సార్థకత సిద్ధిస్తుందన్నారు. మనం చేసే ప్రతి ప్రయత్నం సక్సెస్ అవుతుందో లేదో కానీ సక్సెస్ కావాలన్న తపనతోనే విద్యను అభ్యసించి దేశం గర్వించే స్థాయికి చేరుకోవాలని ఆకాక్షించారు. తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించే ప్రయత్నం చేయాలన్నారు. తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నగర శాఖ అధ్యక్షులు కళ్యా సుధాకర్, ప్రధాన కార్యదర్శి పల్లా నరసింహారావు మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా సంఘం తరపున విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తూ వారిలో దాగివున్న నిగూఢమైన శక్తిని వెలికి తీసే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. తమ మంచి ప్రయత్నానికి సంఘం పెద్దలు అందిస్తున్న తోడ్పాటు ఎప్పటికీ మరువలేనిదన్నారు. ఈ సంవత్సరం 71 మంది విద్యార్థులకు నగదు పురస్కారాలు మెడల్స్ ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి కొత్త ఉత్సాహాన్ని నింపామన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పు శంకర్, జిల్లా సంఘం నాయకులు బండారు సూర్యనారాయణ, కుండా భాస్కర్, నగర శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రమణ్యం, కోశాధికారి టేకూరి సుదర్శన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పల్లా మురళీ కృష్ణయ్య, ఉపాధ్యక్షులు చౌడం సూరిబాబు, గౌరవ అధ్యక్షులు పల్లా బాల చౌడన్న, సుంకర రామచంద్రుడు, సంగినాదం ఆంజనేయులు, గోవిందు నాగ రాజు, సిఆర్ఐ సునీల్ జయంత్, బొమ్మిశెట్టి చంద్రశేఖర్, డాక్టర్ చౌడం వెంక టేష్, బొలిశెట్టి వెంకటస్వామి, దొండ్ల వెంకటరమణ, కాల్వ వాగేష్ పాల్గొన్నారు.

బిసి భవన్ వసతులకు నిధులు కేటాయించండి కడప నగరంలో బిసి భవనంలో నిర్వహించే కార్యక్రమానికి హాజరైన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ను బిసి సంఘం నాయకులు కలిసి మౌలిక వసతులకు నిధులు కేటాయించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకుపోవాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, గోవింద్ నాగరాజు, కళ్యా సుధాకర్, త్రివిక్రమ్, సిఆర్ఐ సునీల్, హరికుమార్ పాల్గొన్నారు.

పేద విద్యార్థినులకు అండగా ఉంటాం

- డాక్టర్ కుప్పిరెడ్డి నాగిరెడ్డి

మాట్లాడుతున్న డాక్టర్ కుప్పిరెడ్డి నాగిరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

25 సంవత్సరాల నుంచి రెడ్డి సేవా సమితి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థినులకు ఉపకార వేతనాలిచ్చి ఉన్నత చదువులు చదివిస్తుందని రెడ్డి సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ కుప్పిరెడ్డి నాగిరెడ్డి అన్నారు. ఆదివారం కడప రాజీవ్ మార్గ్‌లో ఉండే రెడ్డి సేవా సమితి ప్రాంగణంలో సమితి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మొదట వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాగిరెడ్డి మాట్లాడుతూ ఇంజినీరింగ్, వైద్య విద్యలను అభ్యసించే విద్యార్థిని విద్యార్థులకు రూ.2 లక్షల ఉపకార వేతనాలు అందిస్తున్నామని తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 8,9,10 తరగతులలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అర్హులైన పేద విద్యార్థినులకు విద్యను అభ్యసించుటకు వీలుగా 12 మంది బాలికలకు సదుపాయం కల్పించాలన్నారు. సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాజీవ్ మార్గ్‌లో వేమన సర్కిల్‌గా నామకరణం చేసి అందు వేమన విగ్రహం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రెడ్డి సేవా సమితి రజతోత్సవాల సందర్భంగా వేలాది మంది రెడ్డి ప్రముఖుల వివరాలతో 'మేలుకొలుపు' ప్రత్యేక సంచికను రూపకల్పన చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల పిల్లలకు వేమన పద్యాల పోటీలు నిర్వహించి నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేస్తున్నామని చెప్పారు. పండుగ రోజుల్లో మన సంస్కృతిని ప్రతిబింబించే విధంగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కోశాధికారి గుడ్ల ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్‌లో పట్టు సాధించాలనే ఉద్దేశంతో హాస్టల్‌లో ఉండే విద్యార్థినులకు కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పడానికి అధునాతన పద్ధతులకు అనుగుణంగా డిజిటల్ టెక్నాలజీతో ప్రత్యేకమైన గదిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యవర్గ సభ్యులు దేవిరెడ్డి రామచంద్రారెడ్డి, పప్పిరెడ్డి రెడ్డి కుమారి,నర్రెడ్డి ఆనంద కుమార్ రెడ్డి, లింగమదిన్నె మధుసూదన్ రెడ్డి, గుర్రంపాటి వెంకటరెడ్డి, సూత్రం శివరామ సుబ్బారెడ్డి, బెల్లం రామకృష్ణారెడ్డి, కరపు రెడ్డి చంద్ర ఓబుల రెడ్డి, శ్రీయపు రెడ్డి శివ నారాయణ రెడ్డి, మోపూరి నాగేశ్వర రెడ్డి, ఎ.రమేష్ రెడ్డి, ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, ఆదినారాయణ రెడ్డి పలు సూచనలు, సలహాలనిస్తూ ప్రతి ఒక్కరూ రెడ్డి సేవా సమితి పురోభివృద్ధికి ఆర్థిక సహాయ సహకారాల్ని అందించాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో రెడ్డి సేవాసమితి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలన్నారు. కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సాంస్కృతిక సందడి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగర శివారులోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం చిరు మబ్బులు దోబూచులాడుతన్న సమయంలో చిన్న చిన్న చినుకుల మధ్య సాంస్కృతి కళా వేదికపై డ్రీం మీడియా సహకారంతో కడప నగరానికి చెందిన మిను డాన్స్ అకాడమీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. విద్యార్థులు శాస్త్రీయ నృత్యాలులు, జానపదాలు, హిందీ పాటలతో ప్రేక్షకులను అలరించారు. ఆనందాన్ని చప్పట్ల రూపంలో తెలియజేశారు. పాటలు. గణనాయక, చూపులతో చంపకే, హిందీ పాటలకు డాన్స్ చేశారు. కార్యక్రమాలను శిల్పారామం పరిపాలన అధికారి ఎస్.కృష్ణ ప్రసాద్ పర్యవేక్షించారు.

నృత్యం చేస్తున్న బాలికలు

నాణ్యమైన వైద్య సేవలకు పెద్దపీట

హృద్రోగులకు ఉచిత సేవలు
డిసిహెచ్ఎస్ కో-ఆర్డినేటర్ వై.హిమదేవి వెల్లడి

ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడపప్రతినిధి

కమ్యూనిటీ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలకు పెద్దపీట వేస్తున్నాం. రాష్ట్రప్రభుత్వం రీస్ట్రక్షరింగ్ పాలసీ ద్వారా కార్డియాలజీ మొదలుకుని స్పెషలిస్టు వైద్యుల నియామకాలను చేసింది. గుండెపోటు లక్షణాలను గుర్తించిన వెంటనే సిహెచ్‌సిలను సంప్రదిస్తే రూ.45 వేలు విలువ కలిగిన త్రాంబోలైసిస్ అనే ఇంజెక్షన్ ఇస్తాం. దీని ద్వారా గుండెపోటు ప్రమాదం నుంచి బయట పడే అవకాశం ఉంది. గుండెపోటు వైద్యంతోపాటు ఇతర వైద్య సేవల్లో డయాగ్నోసిస్‌కు సంబంధించిన ఎంఆర్‌ఐ, సిటి, టిఫాస్కాన్, అల్ట్రాసౌండ్ సహా అత్యాధునిక లూనార్ ఆపరేషన్ థియేటర్ల సదుపాయాలను అందుబాటులోకి తెచ్చాం. గైనిక్, యండి, సర్జరీ, పీడియాట్రిక్, కార్డి యాలజీ, హౌస్ సర్జన్ తదితర నిష్ణాతులైన వైద్యులతో సేవలను మెరుగు పరుస్తున్నామని పేర్కొంటున్న సందర్భంగా డిసిహెచ్ఎస్ జిల్లా కో-ఆర్డినే టర్ డాక్టర్ వై.హిమదేవితో ముఖాముఖి...

కమ్యూనిటీ ఆస్పత్రుల్లో వైద్య ప్రమాణాలను వివరించండి?

జిల్లాలోని కమ్యూనిటీ ఆస్పత్రులను మెరుగైన వైద్యసేవలకు చిరు నామాగా నిలిపాం. గతంలో జిల్లాలోని కమ్యూనిటీ ఆస్పత్రుల్లో ఎక్కువ బి. సి గ్రేడ్ కేటగిరీలు ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా సి కేటగిరీ సేవలు కలిగిన ఆస్పత్రి ఒక్కటి కూడా లేకపోవడాన్ని గమనించాలి. భవిష్యత్‌లో ఎ గ్రేడ్ కేటగిరీ ఆస్పత్రుల సంఖ్యను పెంచాలనే కృతనిశ్చయంతో ముందుకెళ్తున్నాం.

మెరుగైన వైద్యసేవలకు తీసుకుంటున్న చర్యలేమిటి?

రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు గత నెలలో ఇచ్చిన ర్యాకింగ్‌లో ఎ, బి గ్రేడ్ కేటగిరీలతో ముందంజలో ఉన్నాం. అన్ని కేటగిరీల్లో ఉత్తమ పనితీరును కనబరిచాం. కమలాపురం, పోరుమామిళ్ల సిహెచ్‌సిల్లో గైనకాలజిస్టులను నియమించడమైంది. దీంతో రాబోయే రోజుల్లో మరింత మెరుగైన వైద్యసేవలు అందించడానికి గల అవకాశాలను పరిశీలిస్తున్నాం.

గుండెవ్యాధుల నివారణ చర్యలేమిటి?

ఎమర్జెన్సీ మెడికల్ కేర్ ప్రోగ్రామ్ కింద గుండెపోటును గుర్తించిన రోగులకు గంటలోపు త్రాంబోలైసిస్ ఇంజెక్షన్‌ను ఇస్తాం. ఇప్పటి వరకు 60పైగా త్రాంబోలైసిస్ ఇంజెక్షన్లు ఇవ్వడమైంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన గ్రామీణులు గుండెపోటు లక్షణాలను గుర్తించిన వెంటనే సిహెచ్‌సి లను సంప్రదించాలి. జిల్లా కేంద్రంలోని నిష్ణాతులైన వైద్యుల సహకారంతో సేవలు అందిస్తాం. వైద్యనిపుణుల సూచనల సహాయంతో రూ.45 వేల విలువ కలిగిన టెన్‌క్టిపైప్లేస్ ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంది.

కార్డియాలజీ పరికరాల ఏర్పాటుపై మీరేమంటారు?

జిల్లాలోని తొమ్మిది సిహెచ్‌సిల్లో ట్వెల్వ్‌లీడ్ ఇసిజిలు, డీఫిబ్రిలేటర్స్, సంబంధిత ఇంజెక్షన్లు, మందులను అందుబాటులోకి ఉంచాం. జిల్లాకు 16 సెల్‌ఫోన్స్ పంపిణీ చేశామని తెలిపారు. హృద్రోగ లక్షణాల బారిన పడిన రోగులు కలిగిన సిహెచ్‌సిల నుంచి కార్డియాలజీ వైద్య నిపుణుల సెల్‌ఫోన్స్‌కు మోగుతూనే ఉంటుంది. ఈమేరకు వైద్య సిబ్బందికి శిక్షణను సైతం పూర్తి చేశాం.

సిహెచ్‌సి ఆస్పత్రులు ఎన్ని?

ఉమ్మడి జిల్లా పరిధిలో ఏడు సిహెచ్‌సి ఆస్పత్రులున్నాయి. వీటితోపాటు ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రి, పులివెందుల ఏరియా ఆస్పత్రి ఉన్నాయి. ఇందులో సుమారు 24 రకాల వైద్యసేవలు అందు బాటులో ఉంచడమైంది.

ఓపి సేవల వివరాలు తెలపండి?

జిల్లాలోని తొమ్మిది సిహెచ్‌సి ఆస్పత్రుల్లో నెల వారీగా 1,13,466 ఔట్‌పేషెంట్లకు వైద్యసేవలు అందు తున్నాయి. 89 శాతం సేవల్లో పెరుగుదల కనిపిస్తోంది. వీటితోపాటు సుమారు 24 రకాల ల్యాబ్, ఎక్స్‌రే సేవలు అందుబాటులో ఉంచడమైంది.

ఐపి సేవల గురించి చెప్పండి?

డిసిహెచ్ఎస్ పరిధిలో ఏప్రిల్‌లో 12,199 మంది ఇన్‌పేషెంట్ రోగులు ఉన్నారు. గతంలో 106 శాతం ఆపరేషన్స్ పెరగడం గమనార్హం. ఇందులో ఆపరేషన్స్, ఎఫిఎస్ డెలివరీస్, లాబ్‌టెస్ట్‌ల సంఖ్య అమాంతంగా పెరిగింది.

అత్యాధునిక వైద్యసేవలను వివరించండి?

హైరిస్క్ గర్భిణులు, అనీమియా రోగులకు సెకెండరీ హెల్త్‌కేర్ హాస్పిటల్స్‌లో ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తేవడమైంది. అనీమియా రోగులకు ఐరన్, సుక్రోస్ ఇంజెక్షన్స్, బ్లడ్‌ట్రాన్స్‌ఫర్మేషన్ సదుపా యాలున్నాయి. సిజేరియన్ ఆపరేషన్స్, డెలివరీస్ నిర్వహణకు అవసర మైన అత్యాధునిక పరికరాలు, లూనార్ ఆపరేషన్ థియేటర్ వంటి అత్యా దునిక సదుపాయాలు ఉన్నాయి. వీటిసహాయంతో కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందించేందుకు సిద్ధమవుతున్నాం.

డయాలసిస్ కేంద్రాల గురించి చెప్పండి?

జిల్లాలో ప్రొద్దుటూరు, పులివెందుల సిహెచ్‌సిల్లో డయాలసిస్ కేంద్రాలున్నాయి. తాజాగా బద్వేల్ సిహెచ్‌సిలో డయాలసిస్ కేంద్రం ఏర్పా టుకు ప్రతిపాదనలు పంపించాం. ఇన్‌స్టాల్ చేయడం జరిగింది. పిపిపి మోడ్‌లో ప్రయివేటు సంస్థకు నిర్వహణ బాధ్యతలను అప్పగించాల్సి ఉంది.

వృద్ధులను విస్మరిస్తే శిక్షార్హులు

ప్రజాశక్తి - కడప

భద్రత కల్పించాల్సిన వృద్ధులను విస్మరించినా, పరిత్యాగం చేసే విధంగా బుద్ధిపూర్వకంగా వ్యవహరించినా ు శిక్షార్హులు అవుతారని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు అన్నారు. లీగల్ ఎయిట్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులచే ఆదివారం చౌడమ్మ వృద్ధాశ్రమం, బృంద వృద్ధాశ్రమంలో ప్రపంచ వృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌కు చట్టపరమైన సహాయం, అవసరాలు, నల్సా స్కీం, ఉచిత న్యాయ సహాయం వంటి పథకాలున్నాయన్నారు. వృద్ధులకు వారి పిల్లలు భద్రత కల్పించాలన్నారు. లేకపోతే గరిష్టంగా మూడు నెలలు జైలు శిక్ష లేదా రూ. ఐదువేలు అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. అర్హులు తగిన సమాచారం కోసం, సూచనలకు, న్యాయ సేవల కోసం ప్రతి ఆర్‌డిఒ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కడప దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రవీణ్ కుమార్, వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్లీ ఏబుల్ సీనియర్ సిటిజన్స్ డిపార్ట్మెంట్ సూపర్డెంట్, సంస్థ ప్రతినిధులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

బ్లాక్ మెయిల్ చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగాల పేరుతో తనతోపాటు మరికొందరిని మోసగించి బ్లాక్ మెయిల్ చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర అధ్యక్షులు కోటపాటి సుబ్బమ్మ కోరారు. ఆదివారం సమితి కార్యాలయంలో ఆమె బాధితులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఒంటిమిట్ట ఆలయంలో స్వీపర్ పని చేసేందుకు తమ బంధువులను పనికి పెట్టగా వారికి నెలనెలా వేతనాలు వచ్చాయన్నారు. నమ్మకంగా ఉండడంతో తన కుమారుడికి, ఇతరులకు ఉద్యోగాలు వస్తాయని నమ్మి పెద్ద మొత్తంలో నగదు రాబట్టారన్నారు. నకిలీ పత్రాలు, ఐడి కార్డులతో కాలం వెళ్లదీస్తూ వచ్చారన్నారని తెలిపారు. ఈ క్రమంలో శిక్షణ నిమిత్తం విజయవాడకు వెళ్లాలని చెప్పడంతో అసలు విషయం బయటికి వచ్చిందన్నారు. ఇద్దరు అధికారులు మీడియేటర్లుగా వ్యవహారించేవారన్నారు. ఒక వ్యక్తి బ్లాక్ మెయిల్ చేస్తూ రూ.5 లక్షల డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. అతని ఒత్తిడి తట్టుకోలేక రూ.లక్ష తాను చెల్లించగా, మిగతా సొమ్ము ఇవ్వాలని మరింత ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఈ వ్యవహారంలో తాను ఒక్క రూపాయి కూడా వాడింది లేదన్నారు. ఈ విషయంగా ఎలాంటి విచారణనైనా నిర్వహించుకోవచ్చన్నారు. ఈ వ్యవహారంపై తాను ఎస్‌పి, డిజిపిని సైతం కలిశానన్నారు. ఎస్‌పి ఆదేశాల మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. మహిళలకు జరిగిన అన్యాయంపై సత్వరమే న్యాయం చేయాలని పోలీసు యంత్రాంగాన్ని కోరుతున్నామన్నారు. సమావేశంలో చిప్పగిరి మీనాక్షి, అరుణ కుమారి, బాధిత మహిళలు పాల్గొన్నారు.

సర్వ మంగళం స్వీట్స్ దుకాణం ప్రారంభం

ప్రజాశక్తి - కడప

కడప నగరం మద్రాస్ రోడ్ కృష్ణ సర్కిల్ వద్ద సర్వమంగళం స్వీట్స్‌ను ప్రొప్రైటర్స్ సుబ్బమ్మ, నారాయణ, నరేంద్ర కుమార్ పూజా కార్యక్రమాలతో ఆదివారం గొప్పగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుచికి, శుచికి, శుభ్రతకు, నాణ్యతకు తమ సర్వమంగళం స్వీట్స్ అన్నారు. సర్వ మంగళం స్వీట్స్‌లో స్వచ్ఛమైన బెంగాలీ స్వీట్స్, షుగర్ ఫ్రీ స్వీట్స్, మిల్లెట్స్ స్నాక్స్ లభిస్తాయన్నారు. అన్ని రకాల స్వీట్లు సరసమైన ధరలకు లభిస్తాయని తెలిపారు. వివాహ శుభకార్యాలకు ఆర్డర్లపై సప్లయ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దుకాణం ప్రారంభిస్తున్న ప్రొప్రైటర్లు

కెవిలో మౌలిక వసతులు అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న జితేంద్ర

కడప కేంద్రీయ విద్యాలయంలో అదనపు గదులు నిర్మించాలని, మున్సిపల్ నీటి పైప్ కనెక్షన్ ఇవ్వాలని, బోధనా పరికరాలు, లైబ్రరీ, సైన్స్ ల్యాబ్ అభివృద్ధి పరచి విద్యా ప్రమాణాలు పెంచాలని సర్వసభ్య సమావేశంలో సభ్యులు తీర్మానించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ సభ్యులు గురు భాస్కర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కోశాధికారి యల్. జితేంద్ర మాట్లాడుతూ వెంటనే కెవికి మున్సిపల్ నీటి కుళాయి సౌకర్యం కల్పించాలని కోరారు. 11ఏళ్లుగా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, కెవి ఉన్నతాధికారులకు విన్నవిస్తూ న్నామన్నారు. విద్యాలయం బయట ఆరు బస్సులకు పార్కింగ్ స్థలం, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అసోసియేషన్ రూట్ 5 కన్వినింగ్ కమిటీ కన్వీనర్ పి.శామ్సన్ అనిల్ మాట్లాడుతూ గతంలో కెవికి అమ్మఒడి పథకం అమలయ్యేదని, ఈ విద్యా సంవత్సరం కూడా తల్లికి వందనం కొనసాగించాలని కోరారు. రూట్ 1 కన్వీనర్ భూమిరెడ్డి రమేష్ బాబు మాట్లాడుతూ ే ఆర్టీసీ అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ విద్యాసంవత్సరం కూడా బస్సుల సౌకర్యం కొనసాగించాలని కోరారు. రూట్ 6 కన్వీనర్ కె. సాయి ప్రసాద్ బాబు మాట్లాడుతూ పేరెంట్స్ అసోసియేషన్ విద్యాలయ అభివృద్ధిలో పూర్తి స్థాయి కృషి చేస్తూ ఉందన్నారు. కేంద్రీయ విద్యాలయంకు అదనపు తరగతి గదులు నిర్మించాలని తెలిపారు. ఆర్‌టిసి 6 బస్సులు ఏర్పాటు చేసినందుకు సమావేశంలో తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో రూట్ 3 కన్వీనర్ కె.జయ దుర్గా ప్రసాద్, కో-కన్వీనర్లు మహమ్మద్ అలీ, వస్త్రాల నరసింహులు, పి.మునీంద్ర, రమేష్, జి.రామ పుల్లయ్య, ఎ.ముని రత్న రాజు, శ్రీనివాస రావు, రేఖా కిరణ్మయి, ఎస్.కల్పన, సి.సుకన్య, టి. రమాదేవి పాల్గొన్నారు.

టిడిపి ప్రభుత్వంలో విద్యకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - కడప అర్బన్

టిడిపి ప్రభుత్వంలోనే విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ తెలిపారు. ఆదివారం నగరంలోని ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద 'థాంక్యూ సిఎం సార్' అంటూ సిఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే మాధవి రెడ్డి చిత్రపటాలకు టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ప్రధాన హామీ తల్లికి వందనం అమల్లోకి రావటంతో రాష్ట్ర వ్యాప్తంగా తల్లిదండ్రుల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.13 వేల చొప్పున రూ.8,745 కోట్లను నేరుగా వారి తల్లుల ఖాతాలో జమచేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నగర మహిళా అధ్యక్షురాలు సునీత, 14వ డివిజన్ ఇన్‌ఛార్జి దివాకర్, మాజీ కార్పొరేటర్ చిన్న బాబు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు అమృత్, నవీన్, సాయి, వెంకటేష్, రూపేష్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

లింగాల మండల అబ్జర్వర్‌గా మడక చక్రధర్

లోకేష్‌తో మడక చక్రధర్

ప్రజాశక్తి - కడప : కడప పార్లమెంటులోని పులివెందుల నియోజకవర్గం లింగాల మండల అబ్జర్వర్‌గా టిడిపి తొగట వీర క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు మడక చక్రధర్‌ను టిడిపి అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా మడక చక్రధర్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తనపై నమ్మకంతో కడప పార్లమెంట్ లోని, పులివెందుల నియోజకవర్గంలోని, లింగాల మండల అబ్జర్వం గా నన్ను నియమించినందుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి పార్టీకి మంచి పేరు తెస్తానని పేర్కొన్నారు. నా నియామకానికి సహకరించిన కడప జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి సవితకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఇర్ఫాన్ బాషా

అందరికీ అందుబాటులో ఉంటా..ఆదరించండి

కాంగ్రెస్ సమన్వయకర్త ఇర్ఫాన్‌బాషా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

గ్రామాలను అభివృద్ధి వైపు నడిపించేందుకు అందరికీ అందుబాటులో ఉంటానని, తనను అందరూ ఆదరించాలని ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఇర్ఫాన్ బాషా పేర్కొన్నారు. రాజుపాలెం మండలం వెలవలి గ్రామాన్ని ఆదివారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి సందర్శించారు. వెలవలి సర్పంచ్ మహబూబ్ బాషాతో ప్రజలకు ఉన్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇర్ఫాన్ బాషా మాట్లాడుతూ వెలవలి గ్రామంలో నీటి, విద్యుత్ సమస్యతోపాటు, ఇతర సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. సమస్యలను అధికారులతో పరిష్కారం చేయిస్తానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో ఏ కష్టం వచ్చినా తమ దృష్టికి తెస్తే ప్రజల తరపున పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి ఎల్లయ్య, రాజుపాలెం మండల ఇన్‌ఛార్జి రషీద్, నన్నే, అబ్బాస్, ఖలందర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి తరగతికీ ఒక ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తీసుకొచ్చిన మోడల్ పాఠశాలల్లో ఒకటి నుంచి 5వ తరగతి వరకు ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు అందుబాటులో ఉంటారని ఎంఇఒలు రవిశంకర్, వంశీకృష్ణ తెలిపారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా వారు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ మండల పరిధిలో అన్నవరం, చియ్యపాడు, మొర్రాయపల్లె, చాపాడు, పల్లవోలు, పల్లవోలు దళితవాడ, ఖాదర్‌పల్లె, లక్ష్మీపేట, నక్కలదిన్నె, వి.రాజుపాలెం గ్రామాల పాఠశాలలను మోడల్ పాఠశాలలగా ఎంపిక చేశారన్నారు. ఈ పాఠశాలలకు సమీప గ్రామాల పాఠశాలల నుంచి 3,4,5 తరగతుల విద్యార్థులను విలీనం చేశారన్నారు. ఈ నేపథ్యంలో 60 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు ఐదు మంది ఉపాధ్యాయులను నియమించారన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా సన్న బియ్యంతో పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టమన్నారు. మండల పరిధిలోని 62 పాఠశాలల్లో 2,786 మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. వీరందరికీ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్స్ పథకం కింద పుస్తకాలు, యూనిఫామ్, బూట్లు, సాక్స్‌లు, డిక్షనరీ అందజేశామన్నారు. ఎనిమిదేళ్ల ఒకే పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులను బదిలీ చేసే ప్రక్రియ కూడా పూర్తయిందన్నారు. అన్ని పాఠశాలలకు సిబ్బందిని కూడా నూతనంగా నియమించామన్నారు. మనబడి.. మన భవిష్యత్తు ద్వారా పెండింగ్ పనులన్నీ కూడా పూర్తయ్యాయన్నారు. విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు అందుబాటులో ఉన్నాయన్నారు. నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలలో అందుతుందని, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రయివేట్ పాఠశాలల మోజులో పడకుండా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలిన్నారు. అర్హులైన విద్యార్థులందరికీ తల్లికివందనం పథకం కింద రూ.13వేలు జమ అయిందన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒలు రవిశంకర్, వంశీకృష్ణ

నేడు లేపాక్షి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఈనెల 16న ఉదయం 9గంటల నుంచి లేపాక్షి డిగ్రీ కళాశాలలో ఏర్రేయల్ డికాన్స్ కొప్పర్తి పారిశ్రామికవాడలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాంచరణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతను బట్టి ఈ ఉద్యోగాలు 10 ఇంటర్ డిగ్రీ బీటెక్ విద్యార్థులకు ఉద్యోగాలు ఉంటాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని చెములపల్లి బిసి కాలనీకి చెందిన బందుగాళ్ల అలీసాబ్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.56వేల చెక్కును ఆదివారం టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ రెడ్యం వెంకటరామిరెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా బాధితులకు సాయం అందేలా ఎమ్మెల్యే కృషి చేస్తుండడం మరువలేని విషయమన్నారు.

మండల పరిశీలకులుగా టిడిపి నాయకుల నియామకం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులను టిడిపి అధిష్టానం జిల్లాలోని వివిధ మండలాల పార్టీ పరిశీలకులుగా నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. టిడిపి రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనపాల జగన్‌ను బద్వేలు మండలానికి, బీసీ సెల్ పార్లమెంటరీ అధ్యక్షులు మేకల బాబును పోరుమామిళ్ల మండలానికి, జంగం సాధికారక సమితి కన్వీనర్ కొండపల్లి ఉమాకాంత్‌ను శ్రీఅవధూత కాశినాయన మండలానికి, జిల్లా అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డిని వేముల మండలానికి, మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎపి రవీంద్రను వల్లూరు మండల పరిశీలకులుగా నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తమపై నమ్మకం ఉంచి వివిధ మండలాల పరిశీలకులుగా నియమించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక శ్రీచైతన్య హైస్కూల్ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు మానవత సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి చెప్పారు. తిరుపతికి చెందిన అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వేముల, చక్రాయపేట, వేంపల్లె మండలాల నుంచి ప్రజలు వచ్చారు. అరవింద్ కంటి ఆసుపత్రి వైద్యులు శ్రేయ, లక్ష్మి ప్రత్యూష దాదాపు 400 మంది రోగులకు కంటి పరీక్షలు చేసినట్లు చక్రపాణిరెడ్డి తెలిపారు. వీరిలో 45 మందికి ఆపరేషన్లు అవసరమని వైద్యులు సూచించారని పేర్కొన్నారు. ఆపరేషన్లు చేయాల్సిన రోగులను తిరుపతి అరవింద్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఆపరేషన్లు చేయించుకొంటున్న వారికి శ్రీ చైతన్య పాఠశాల ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మానవత సేవా సంస్థ కో-చైర్మన్ కావలి కృష్ణతేజ, రీజినల్ చైర్మన్ చల్లా బాలాజీ, మానవత అధ్యక్షులు పోతిరెడ్డి శ్రావణ్‌కుమార్, ఉపాధ్యక్షులు యోగేశ్వర బాబు, కోశాధికారి శ్రీకళ, ఇసి ఎడ్యుకేషన్ చైతన్యకుమార్, ఇసి అవేర్నెస్ శశింద్ర కుమార్‌రెడ్డి, మానవత డైరెక్టర్ కుప్పల గంగయ్య, అరవింద్ కంటి ఆసుపత్రి కో-ఆర్డినేటర్ గౌరిశంకర్, అరవింద్ ఆసుపత్రి సిబ్బంది, మానవత సంస్థ సభ్యులు, శ్రీచైతన్య పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ఆ.. వీధిలో నిత్యం మురుగు నీరే..!

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వెనుక ఏరువాక గంగమ్మ దేవాలయం వీధిలో నిత్యం మురుగునీరు దర్శనమిస్తూంటూంది. ఇక్కడ నడవాలంటే చాలా ఇక్కట్లు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా కాలంగా ఈ వీధి ఇలాగే ఉందని, అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశామన్నారు. మున్సిపాలిటీ పైప్‌లైన్ వేసేందుకు తవ్వకాలు జరిపినప్పటి నుంచి ఇంకా ఎక్కువ గుంతలు పడ్డాయన్నారు. చిన్నపాటి వర్షం పడినా పెద్దగా నీరు నిల్వ చేరి, వీధిలో తిరిగేందుకు దారి ఉండదన్నారు. మురుగు నీటిలో తిరిగి పిల్లలు, పెద్దలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీధిలో ఉన్నవారికి మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయని వాపోతున్నారు. వందల కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నాయని తెలిపారు. ఈ వీది నుంచి ఆరు వీధులకు దారి ఉందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వెంటనే రోడ్డు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

అపరిశుభ్రంగా ఉన్న ఏరువాక గంగమ్మ దేవాలయం వీధి

ఇంటి నుంచి బయటకు రాలేకున్నాం..

ఇంటి నుంచి బయటికి రావాలంటేనే భయపడాల్సి వస్తోంది. రోడ్డంతా గుంతలమయం. నిత్యం మురుగు నీరు నిల్వ ఉంటుంది. దోమల బెడద ఎక్కువ. జ్వరాలు వస్తున్నాయి. నిత్యం ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. పలు మార్లు అధికారులకు చెప్పినా ప్రయోజనం లేదు. వెంటనే అధికారులు స్పందించి కొత్త రోడ్డు వేయించాలి లేదా ఉన్నది బాగు చేయించాలి.

- శంషుద్దీన్, స్థానికుడ

'అలగనూరు'కు రూ.36 కోట్లతో ప్రతిపాదనలు

అలగనూరు ప్రాజెక్టు మ్యాప్‌ను వివరిస్తున్న వివరిస్తున్న ఎమ్మెల్యే 'పుట్టా'

ప్రజాశక్తి - చాపాడు

అలగనూరు ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తీసుకొస్తే కెసి కాలువ ఆయకట్టుకు ఖరీఫ్, రబీ సీజన్లకు నీరు సమృద్ధిగా లభిస్తుందని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. నంద్యాల జిల్లా నంది కొట్కూరు నియోజకవర్గ పరిధిలోని మిడుతూరు మండలం వద్ద అలగనూరు ప్రాజెక్టు ఉన్న ప్రాంతాన్ని ఆదివారం ఎమ్మెల్యే జయసూర్యతో కలిసి పుట్టా సుధాకర్ యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా పుట్టా మాట్లాడుతూ 2.95 టిఎంసి సామర్థ్యంతో అలగనూరు ప్రాజెక్టు నిర్మించారన్నారు. 700 మీటర్ల మేర కట్ట బలహీనంగా ఉందని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే నీటిని నిలువ ఉంచుకోవచ్చన్నారు. నంద్యాల జిల్లా రైతులకు కేవలం తాగునీటికి మాత్రమే ఈ ప్రాజెక్టు ఉపయోగ పడుతుందన్నారు. కడప జిల్లాకు వ్యవసాయానికి ఈ నీటిని ఉప యోగించుకోవచ్చు అన్నారు. గత ప్రభుత్వంలో రూ.5 కోట్లతో మరమ్మతులు చేపట్టేందుకు నాయకులు వెనుకడుగు వేశారన్నారు. ప్రస్తుతం రూ.36 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారని, ప్రభుత్వం నిధులు విడు దల చేయగానే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాజోలి ఆనకట్టను నిర్మించాలంటే 8,500 ఎకరాల భూమి, ఆరు గ్రామాల రైతులకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం రూ.1,500 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాజోలి ఆనకట్ట కన్నా అలగనూరు ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావడం మంచిదన్నారు. రెండేళ్లల్లో ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు నీటిని విడుదల చేయిస్తామన్నారు. కార్యక్రమంలో కెసి కెనాల్ ప్రాజెక్టు వైస్ చైర్మన్ డి.గురివిరెడ్డి, టిడిపి నాయకులు అన్నవరం సుధాకర్ రెడ్డి, దాసరి బాబు, శ్రీనివాసులు, ఓబుల్‌రెడ్డి, శివశంకర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామ పంచాయతీలకు విడుదల చేయాలని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసిరెడ్డి సూచించారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో డబ్బుల్లేని కారణంగా పారిశుధ్యం పడకేసిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం రెండవ విడత 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,121 కోట్లు కేంద్ర ప్రభుత్వం 5 నెలల కిందట రాష్ట్రానికి విడుదల చేసిందని చెప్పారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. నిధులు లేకపోవడంతో సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి వచ్చిందన్నారు. పంచా యతీల్లో పారిశుధ్యం సరిగా లేకపోవడంతో అంటువ్యాధులు ప్రబలుతున్నట్లు చెప్పారు. వేంపల్లె గ్రామ పంచాయతీలో 6 నెలలుగా సిబ్బందికి జీతాలు లేవన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయితీలకు విడుదల చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం కింద రైతులు వడ్డీకి అప్పు తెచ్చి గోకులం, మినీ గోకులం షెడ్లు నిర్మించుకున్నారని తెలిపారు. షెడ్లను నిర్మించి 6 నెలలు అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు రాని కారణంగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

నాన్న ప్రాముఖ్యతను తెలిపేందుకే పితృదినోత్సవ లక్ష్యం

సమాజానికి, బిడ్డలకు నాన్న ప్రాముఖ్యత, విశిష్టతను తెలియజేయడమే పితృదినోత్సవం ఉద్దేశమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ పితృదినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాన్నంటే ఓ ధైర్యం, బాధ్యత, ఓ భద్రత అన్నారు. అమ్మకు, బ్రహ్మకు మధ్య వారధి నాన్న అన్నారు. తండ్రి నిరంతరం బిడ్డల బాగోగులు, వారి బంగారు భవిష్యత్ గురించే ఆలోచిస్తుంటాడని చెప్పారు. ప్రస్తుత సమాజంలో కొందరు తమ నాన్నలను వృద్ధాప్యంలో బిడ్డలు పట్టించుకోని కారణంగా దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని పేర్కొన్నారు. వృద్ధాప్యంలో వారికి భూలోకంలో యమలోకం చూపిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితి రాకూడదన్నదే అంతర్జాతీయ పితృదినోత్సవ లక్ష్యమని తులసిరెడ్డి అన్నారు.

ఆధునిక తెలుగు కవిత్వానికి చిరునామా శ్రీశ్రీ

శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహితీ అభిమానులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

తెలుగు సాహిత్యాన్ని శాసించిన ఆధునిక మహాకవి శ్రీశ్రీ అని, ఆయన తెలుగు సాహిత్యానికి చిరునామాగా నిలిచారని ప్రముఖ సాహితీవేత్త జింకా సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శ్రీశ్రీ 42వ వర్ధంతి సభను జన విజ్ఞాన వేదిక, సాహిత్య కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జెవివి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జింకా సుబ్రమణ్యం మాట్లాడుతూ అంతవరకు ఉన్న సంప్రదాయ చందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించి శ్రీశ్రీ ఆధునిక అభ్యుదయ భావాలకు పునాది వేశారని, మహాప్రస్థానం రచన ద్వారా తెలుగు సాహిత్యానికి కొత్త ఒరవడిని సృష్టించారని పేర్కొన్నారు. తొలుత శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విరసం వరలక్ష్మి మాట్లాడుతూ సామాన్య జనం కోసం కవిత్వాన్ని జన భాషలో రాసిన శ్రీశ్రీ ప్రజాకవి అని కొనియాడారు. జన విజ్ఞాన వేదిక నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం శ్రీశ్రీ పరితపించానని అన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ శ్రీశ్రీ మహాప్రస్థానం తెలుగు సాహిత్యం ఉన్నంతవరకు నిలిచి ఉంటుందన్నారు. సమావేశంలో పుత్తూరు వెంకట సుబ్రహ్మణ్యం, పి.వి.రామారావు, సహదేవుడు, సారథి, అక్షయ పాల్గొన్నారు.

కడప అర్బన్ : శ్రీరంగం శ్రీనివాసరావు సామాన్య జీవితాన్ని ప్రారంభించి తన తెలుగు సాహిత్య గేయ రచయితలతో అభిమానుల చేత శ్రీశ్రీగా బిరుదు అందుకున్న మహాకవి శ్రీశ్రీ అని తెలుగుదేశం పార్టీ నగర ఉపాధ్యక్షులు కొండ సుబ్బయ్య అన్నారు. ఆదివారం శ్రీశ్రీ 42వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ సినీ రంగాలలో కూడా ఎన్నో ఉత్తమమైన గీతాలను అందించారని తెలిపారు. అందులో దేవుడు చేసిన మనుషుల్లారా, యమగోల, అల్లూరి సీతారామరాజు చిత్రాల గీతాలతో తెలుగు రాష్ట్ర ప్రజల మన్నలను పొందారని చెప్పారు. 1974 సంవత్సరంలో అల్లూరి సీతారామరాజు చిత్రంలో అందించిన 'తెలుగు వీర లేవరా..' అనే గీతాన్ని నేటికీ ఆలపిస్తు, వినిపిస్తూ ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాయల్ అబ్దుల్ కరిముల్లా, నాగయ్య పాల్గొన్నారు.

శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొండా సుబ్బయ్య

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో అవకతవకలు

అక్రమ నిర్మాణాల తొలగింపులో జాప్యం-మురుగు కాలువ మీద కట్టడాలు-పట్టని అధికారులు

రోడ్డు విస్తరణలో తొలగించిన ఆక్రమణలు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - ముద్దనూరు

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండల కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. రైల్వేగేటు నుంచి పాత బస్టాండ్, నాలుగు రోడ్ల కూడలి వరకు జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నారు. అందులో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలను తొలగించడంలో జాతీయ రహదారి అధికారులు జాప్యం చేస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. పలుకుబడి ఉన్న వారి గృహాలను కొలతలు వేసిన ప్రకారం కాకుండా నామ మాత్రంగా తొలగించి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మురుగు కాలువ నిర్మాణం కోసం నాలుగు రోడ్ల నుంచి పాత బస్టాండ్ వరకు కాలువ తీశారు. కొలతల మేరకు నేరుగా కాకుండా పలుకుబడి ఉన్న వారి గృహాల వద్ద విస్తరించకుండా సామాన్య ప్రజలను మాత్రం ఇబ్బందులు పెడుతూ కాలువ వంకర టింకరగా తీశారని ప్రజలు, దుకాణదారులు వాపోతున్నారు. రోడ్డుకు ఓ వైపు ఆక్రమణలు తొలగించి మురుగు కాలువ ఏర్పాటు చేస్తే కాలువపై కూడా అక్రమంగా కట్టడాలు కడుతున్నారు. జాతీయ రహదారి అధికారులు నిబంధనలు పాటించకుండా పక్షపాత ధోరణితో పనులు ఇష్టారాజ్యంగా చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమ కట్టడాల తొలగింపు, మురుగు కాలువ విస్తరణలో ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ఆరోపిస్తున్నారు. అధికారుల పక్షపాత, నిర్లక్ష్య వైఖరిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ప్రజలు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి విస్తరణ పనుల్లో అవకతవకలను గుర్తించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మాట్లాడుతున్న వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

నిజాన్ని ప్రచారం చేసినా కేసులు నమోదు చేయడం భావ్యమా? : 'రాచమల్లు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు టిడిపి నాయకులు అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడం లేదా అని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్రశ్నించారు. రూరల్ పరిధిలోని దొరసానిపల్లెలో ఆయన నివాసంలో ఆదివారం రాచమల్లు విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఓ టిడిపి కౌన్సిలర్‌ను మట్కా కేసులో పోలీసులు కేసు నమోదు చేయడం, మరో కౌన్సిలర్ భర్త చౌకబియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే కేసు నమోదు చేయడం, ఇటీవల ఎమ్మెల్యే వరద అనునయుడు మట్కా కేసులో అరెస్టయ్యారని వివరించారు. టిడిపి నుండి గతంలో కౌన్సిలర్‌గా పోటీ చేసిన వ్యక్తిని మట్కా కేసులో అరెస్ట్ చేస్తే ఆ విషయం సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వైసిపి నాయకులపై పోలీసులు ఏ విధంగా కేసు నమోదు చేస్తారని, ప్రొద్దుటూరులో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలులో ఉందని విమర్శించారు. గతంలో తనపై సోషల్ మీడియాలో మార్ఫింగ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయలేదని, వైసిపి వారు నిజాన్ని ప్రచారం చేసినా అక్రమ కేసులు నమోదు చేయడం భావ్యం కాదన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అవినీతి గురించి తాను చాలాసార్లు ప్రస్తావించానని, వాటన్నింటికీ ఆధారాలున్నాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి శేఖర్ యాదవ్, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, గుర్రం లావణ్య, రాగుల శాంతి, మన్నె సత్యం, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పాతకోట ముని వంశీధర్‌రెడ్డి, అనిల్, రావులకొల్లు అరుణ, నాయకులు భీమునిపల్లె నాగరాజు, బలిమిడి చిన్నరాజ, గంజికుంట ఆంజనేయులు, రవి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని లాడ్జి యాజమాన్యాలను పట్టణ సీఐ చాంద్ బాషా హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని పలు లాడ్జిలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లాడ్జిలలో వచ్చే పోయే వారి సమాచార రిజిస్టర్‌ను పరిశీలించారు. తప్పనిసరిగా లాడ్జిలో బస చేసే వారి ఆధార్ కార్డుతోపాటు వారి వివరాలను రిజిస్టర్ నమోదు చేయా లని సూచించారు. జూదం, వ్యభిచారం వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వ హిస్తే లాడ్జిలను సీజ్ చేయడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుం టామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ విష్ణు నారాయణ, పోలీసులు పాల్గొన్నారు.

లాడ్జిలో రికార్డు పరిశీలిస్తున్న సిఐ చాంద్ బాషా

ఘనస్వాగతం పలుకుతున్న సుబ్బారెడ్డి, సాయి కుమార్‌రెడ్డి

టిడిపి నాయకులకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని కుప్పం గ్రామ పంచాయతీలో టిడిపి నాయకులకు ఆదివారం ఘన స్వాగతం లభించింది. కుప్పం గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి, సాయికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి పులివెందుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి బీటెక్ రవి సోదరుడు మారెడ్డి భరత్‌రెడ్డి టిడిపి చక్రాయపేట మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లి మహేశ్వర్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్‌లో భాగంగా తల్లికివందనం పథకం ప్రజల్లో ఎంతో ఆనందోత్సహాన్ని కలిగించిందన్నారు. కూటమి ప్రభుత్వం చెప్పిన సూపర్‌సిక్స్ పథకాలు అంచెలంచెలుగా ఆగస్టు 15నాటికి పూర్తవుతాయని వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటిలో యోగా శిక్షణ విజయవంతం

ప్రజాశక్తి - వేంపల్లె

ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా 5 రోజులపాటు నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. ఆదివారం యోగ శిక్షణ పూర్తిచేసిన 1,891 మంది విద్యార్థులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన విద్యార్థులు తమ స్వగ్రామాలు, పూర్వ పాఠశాలలో యోగా శిక్షణ కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఖర్చులేని ఆరోగ్యం యోగా ద్వారానే సాధ్యం అన్నారు. యోగా శిక్షణ విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుందని తెలిపారు. యోగా దినోత్సవాన్ని ఒక వేడుకగా కాకుండా ఆరోగ్యంపై అవగాహన కలిగించే సామాజిక ఉద్యమంగా మలచడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఉన్నత విద్యాశాఖ ద్వారా యోగాంధ్ర పోర్టల్‌లో దాదాపు 4,743 మంది విద్యార్థులు నమోదైనట్లు చెప్పారు. ఆయా కార్యక్రమాల ద్వారా లక్షల మంది యోగా లాభాలను చేరవేసే దిశగా ఆర్జీయూకేటీ ముందడుగు వేసిందన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి రవికుమార్, డీన్ రమేష్ కైలాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరులోని హెూలీస్టిక్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంపు విజయవంతమైంది. స్థానిక శ్రీనివాస్ నగర్ నోకియా కేర్ ఆవరణలో క్యాంపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టిడిపి నాయకులు ముక్తియార్ మాట్లాడుతూ పట్టణంలో సుమారు పది ప్రాంతాల్లో ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వ హించాలని, ఈ క్యాంపులకు హాజరైన వ్యాధిగ్రస్తులకు ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా సేవలందించాలని సంకల్పించామన్నారు. పట్టణంలో అందరూ ఆరోగ్యవం తులుగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. దాదాపు 320మందికి వైద్య పరీ క్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో గుండె వైద్య నిపుణులు డాక్టర్ రాజశేఖర్ వర్మ, హరీష్ బాబు, ఎల్ఎన్‌రెడ్డి, జనరల్ వైద్య నిపు ణులు డాక్టర్ నాగశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. బొల్లవరం బాషా, అలీ అక్బర్, ఎండి అయూబ్‌ఖాన్, మహబూబ్

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ముక్తియార్